సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



..విజ్ఞానం పంచుతూ

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ.. వారిలో విజ్ఞానం పెంచుతూ పలువురు ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో



వచ్చే ఎన్నికల్లో పోటీ ఖాయం

త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని, అందులో ఎలాంటి సందేహం అవసరం లేదని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
30°/ 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వర్షం పడొచ్చు.

న్యూస్‌రీల్

కిన్నెరసానిని సందర్శించిన ఐటీడీఏ పీఓ



కుటుంబసభ్యులతో కలిసి బోట్ షికారు చేస్తున్న పీఓ

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. డీర్ పార్కులోని చుక్కల దుప్పులను వీక్షించి.. ఎన్ని దుప్పులు ఉన్నాయి.. వాటికి ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారనే వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలాశయంలో బోటింగ్ చేశారు.

నేడు 'డయల్ యువర్ ఎస్పీ'

కొత్తగూడెంటౌన్: తమ కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వినీత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు 08744–243666 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలపాలని కోరారు.

సీఎంను కలిసిన తాళ్లూరి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటేశ్వరరావు, రమేష్

కొత్తగూడెంరూరల్ : సీఎం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనగర్ పంచాయతీలోకి మున్సిపాలిటీ మురికి నీరు వస్తోందని, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని రమేష్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, కేసీఆర్ కలెక్టర్ ప్రియాంక ఆలకు ఫోన్ చేసి మరమ్మతు పనుల కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని ఆదేశించారు.

16న సైన్స్ సెమినార్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ ఈనెల 16వ తేదీన సింగరేణి ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 'మిల్లెట్స్ ఏ సూపర్‌ఫుడ్' అనే అంశంపై సెమినార్ ఉంటుందని, కాల వ్యవధి ఆరు నిమిషాలు మాత్రమే ఉంటుందని వివరించారు. 2 నిమిషాలు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. సెమినార్‌లో స్లైడ్స్, పీపీటీ, పోస్టర్లు, చార్టులు ప్రదర్శించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు డీఎస్‌ఓ చలపతిరాజును సంప్రదించాలని సూచించారు.

పినపాక వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: మండలంలోని పినపాక పట్టీనగర్‌కు చెందిన తలారి వెంకటేశ్వర్లుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రాకాసి(రాక్షస) గూళ్లపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గణేష్ చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్



వింధ్య శ్రీ

టేకులపల్లి: మండలంలోని బోడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రేళ్ల బాలకృష్ణ కుమార్తె రేళ్ల వింధ్య శ్రీకి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో అడ్మిషన్ లభించింది. ఎంపిక సమయంలో మండల, జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్ర స్థాయిలో పదో స్థానం సాధించి విశేష ప్రతిభ చాటింది. సోమవారం స్కూల్‌లో చేరినట్లు బాలకృష్ణ తెలిపారు.

క్వార్టర్లు ఖాళీ..



కొత్తగూడెం ఏరియా గౌతమ్‌పూర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్

ఏరియా	ఉద్యోగులు/ కార్మికులు	మొత్తం క్వార్టర్లు	ఖాళీగా ఉన్నవి
కార్పొరేట్	1653	2594	542
కొత్తగూడెం	2585	4438	1335
ఇల్లెందు	675	1709	680
మణుగూరు	2587	3447	945
బెల్లంపల్లి	1079	1749	940
మందమర్రి	5111	11802	4536
శ్రీరాంపూర్	9340	6789	701
భూపాలపల్లి	5481	3713	67
రామగుండం1	5722	7105	531
రామగుండం2	3585	6406	1920
రామగుండం3	4198	2265	416
జైపూర్ (థర్మల్)	139	136	38
మొత్తం	42,176	52,153	12,656

సింగరేణిలో కార్మికుల కంటే అధికంగా నివాసాలు

- సంస్థ విస్తరించిన అన్ని ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి
- 11 ఏరియాల్లో కలిపి 12వేల క్వార్టర్లు..
- ఒక్క మందమర్రిలోనే నాలుగు వేలకు పైగా
- మళ్లీ కొత్తగా రూ.273 కోట్లతో 643 క్వార్టర్ల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మికులు, ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సింగరేణి నిర్మించిన క్వార్టర్లు ఇప్పుడా సంస్థకు భారంగా మారుతున్నాయి. కార్మికుల సంఖ్యకు మించి క్వార్టర్లు ఉండగా వాటిని ఏం చేయాలనే విషయంలో సింగరేణికి స్పష్టమైన కార్యాచరణ లేదు.

వందేళ్ల చరిత్ర..

సింగరేణి వందేళ్లకు పైగా గోదావరి లోయలో బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. 90వ దశకంలో సంస్థ 1.20లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించింది. ఆ రోజుల్లో తెలంగాణ వారికి ఉపాధి అంటే బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి అన్నట్టుగా ఉండేది. దీనికి తగ్గట్టే కార్మిక సంక్షేమంలో భాగంగా సంస్థ పరిధిలో ఉన్న 11 ఏరియాల్లో విరివిగా క్వార్టర్లు నిర్మించింది. అయితే ఆ తర్వాత కాలంలో సింగరేణి ఆర్థికంగా నష్టాల్లో కూరుకుపోవడంతో సంస్కరణ బాట పట్టింది. క్రమంగా యాంత్రీకరణ వైపు అడుగులు వేసింది. భూగర్భ గనుల కంటే కార్మికుల అవసరం తక్కువగా ఉండే ఓపెన్ కాస్ట్ మైనింగ్ వైపు దృష్టి సారించింది. ఫలితంగా కార్మికుల సంఖ్య లక్షా ఇరవై వేల నుంచి ప్రస్తుతం 42 వేలకు పడిపోయింది.

50 వేలకు పైగా..

ప్రస్తుతం సింగరేణిలో 42 వేల మంది కార్మికులు ఉంటే కార్మికులు, ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్లు 52 వేలు ఉన్నాయి. ఇందులో దాదాపు 35 వేల క్వార్టర్లలో కార్మికులు/ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. మరో 1600 క్వార్టర్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి సంస్థకు అనుబంధంగా పని చేసే సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. శిథిలావస్థలో, నివాసయోగ్యంగా లేని విధంగా ఉన్న క్వార్టర్లు మరో 1600 వరకు ఉన్నాయి. ఇలా పనికిరాని, ఇతర పనులకు ఉపయోగిస్తున్న క్వార్టర్లు పోను కూడా సుమారు 12 వేల క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి.

అత్యధికంగా మందమర్రిలో..

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలో 11 ఏరియాల్లో విస్తరించి ఉంది. ఇందులో అత్యధికంగా మందమర్రి ఏరియాలో 11 వేలకు పైగా క్వార్టర్లు ఉండగా, అక్కడ పని చేస్తున్న కార్మికులు/ఉద్యోగుల సంఖ్య ఐదువేలే. అంటే సగానికి పైగా క్వార్టర్లు ఖాళీగానే ఉన్నాయి. ఇక అత్యల్పంగా భూపాలపలిలో 37 క్వార్టర్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. కొత్తగూడెం, రామగుండం ఏరియాల్లో 1000కి పైగా క్వార్టర్లు ఖాళీగా ఉండగా, మణుగూరు, బెల్లంపల్లి ఏరియాల్లో వెయ్యికి దగ్గరగా క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి.

ఇంకా కొత్త క్వార్టర్ల నిర్మాణం..

సింగరేణి సంస్థలో ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా క్వార్టర్లు ఖాళీగా ఉండగా, ఇంకా కొత్త క్వార్టర్లు, కార్యాలయాల నిర్మాణం కోసం సంస్థ రూ. 273 కోట్లు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఇందులో రెండుచోట్ల జనరల్ మేనేజర్ కార్యాలయాలతో పాటు 643 క్వార్టర్లు ఉన్నాయి. ఇవన్నీ కేవలం కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల్లోనే నిర్మిస్తుండడం గమనార్హం. ప్రస్తుత లెక్కల ప్రకారం చూసినా కార్పొరేట్‌లో ఖాళీగా 542, ఏరియా పరిధిలో 1,335 క్వార్టర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇతర సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాల్సిన నిధులను ఇలా మిగులు ఉన్న చోటనే మళ్లీ ఖర్చు పెట్టడం ఎందుకని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.



రుద్రంపూర్‌లో చేపట్టిన కొత్త క్వార్టర్ల నిర్మాణ పనులు

కార్మికుల సంక్షేమం కోసమే



సింగరేణి యాజమాన్యం కార్మికుల సౌకర్యం, సంక్షేమం కోసమే నూతన క్వార్టర్లు నిర్మిస్తోంది. గతంలో మాదిరిగా కాకుండా అందరికీ డబుల్ బెడ్‌రూమ్‌ల తరహాలో సుమారు 800 అడుగుల ఎస్‌ఎఫ్‌టీతో నాణ్యమైన మెటీరియల్ వినియోగించి 70 ఏళ్ల పాటు సురక్షితంగా ఉండేలా క్వార్టర్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే కార్మికుల సంఖ్య కంటే అధికంగా క్వార్టర్లు ఉన్నా, వాటిలో 30 శాతం మేర శిథిలావస్థకు చేరడంతో కూల్చేస్తున్నాం. ఇది ఎవరి స్వలాభం కోసం కాదు.

– టి.సూర్యనారాయణ, జీఎం(సివిల్), కార్పొరేట్

శ్రీమద్భాగవత సప్తాహానికి అంకురార్పణ

ఒంగోలులో వైభవంగా సీతారాముల కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం శ్రీమద్భాగవత అష్టమ సప్తాహం కార్యక్రమానికి ఆలయ అర్చకులు, వేద పండితులు సోమవారం అంకురార్పణ చేశారు. చిత్రకూట మండపంలో హోమం చేసి, ఉత్సవ అనుజ్ఞ తీసుకున్నారు. ఆ తర్వాత విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, రక్షా బంధనం, రుత్విక్ పఠనం, మండపారాధన చేశారు. అనంతరం పండితులు శ్రీ మద్భాగవతాన్ని ప్రవచించారు. ప్రవచనాలు ఈ నెల 11వరకు జరగనున్నాయి. మంగళవారం అగ్నిప్రతిష్ఠ, గోపూజ, భాగవతంలోని 1వ స్కంధం నుంచి 3వ స్కంధంలో 20వ అధ్యాయం వరకు పారాయణం నిర్వహిస్తారు. ఇక సోమవారం సందర్భంగా ఆలయంలో శ్రీసీతారామచంద్రస్వామి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించారు. బేడా మండపంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని కమనీయంగా జరిపించారు.



ఒంగోలులో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలులో సీతారాముల కల్యాణం

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఒంగోలులో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని సోమవారం అంగరంగవైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులతో వెళ్లిన ప్రచార రథానికి భక్తులు మేళతాళాలు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్' పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పాలిటెక్నిక్ అధ్యాపకుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 97 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

విధుల్లో చేరిన రెండో ఏఎన్‌ఎంలు



విధులకు హాజరవుతున్నట్లు లేఖ అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు సోమవారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. హైదరాబాద్‌లో సోమవారం యూనియన్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ లభించడంతో సమ్మె విరమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ సమ్మెను తాత్కాలికంగా విరమించామని తెలిపారు. సమ్మె కాలంలో వేతనాల విషయంలో కొర్రీలు పెడితే సహించేది లేదన్నారు. సమ్మె సమయంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక

పాల్వంచరూరల్: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన హిందీ, బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు టి.అరుణకుమారి, ఎం.పూర్ణచందర్‌రావు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో వీరు అవార్డులు అందుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య తెలిపారు. పాల్వంచ డిగ్రీ కళాశాల జాతీయ స్థాయిలో 'ఎ' గ్రేడ్ సాధించడంతో పాటు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో చేసిన విశేష కృషికి గాను అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాల అధ్యాపకులు ఇద్దరు అవార్డుకు ఎంపిక కావడం పట్ల సహచర లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు.



అరుణకుమారి



ఎం.పూర్ణచందర్‌రావు

నాలుగో రోజుకు చేరిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

827మందిలో 365మందికి అర్హత

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం నాలుగు రోజుకు చేరింది. ఈమేరకు 1,275 మందికి అడ్మిట్ కార్డులు జారీ చేయగా 827మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో అన్ని ఈవెంట్లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల్లో 365 మంది మెడికల్ టెస్ట్‌లో అర్హత సాధించారు. అభ్యర్థుల వివరాలను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేసి, ఎత్తు, బరువు పరిశీలించాక ఒక్కో బ్యాచ్‌కు 100 మంది చొప్పున 1,600 మీటర్ల పరుగు నిర్వహిస్తున్నారు. ఆతర్వాత 9ఫీట్ బ్రాడ్ జంప్, పుల్ అప్స్, జెడ్ క్రాస్ ఈవెంట్లలో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్ట్ చేస్తున్నారు. ప్రతిరోజు అర్ధరాత్రి 12.30గంటల నుంచే అభ్యర్థులను స్టేడియంలోకి అనుమతించగా ఉదయం 8గంటలకల్లా అన్ని పరీక్షలు పూర్తిచేస్తున్నారు.



అభ్యర్థుల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

- నిత్యం అందుబాటులో ఉండేది వనమానే..
- డబ్బు సంచులతో దిగే నాయకులను తరిమేయాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపు



పోస్టాఫీస్ సెంటర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న వద్దిరాజు, వనమా



కొత్తగూడెంలో కార్ల ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పాల్వంచరూరల్ : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వనమా వెంకటేశ్వరరావును మరోసారి గెలిపించుకుందామని, డబ్బు సంచులతో దిగే నాయకులను తరిమేద్దామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బీఆర్‌ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన వద్దిరాజు సోమవారం తొలిసారిగా పర్యటించారు. ఈ సందర్భంగా పాల్వంచలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. మొన్నటిదాకా బీఆర్‌ఎస్‌లో ఉండి సొంత పార్టీనే ఓడించి రూ.వందల కోట్లు సంపాదించుకుని వెళ్లారని, వారే ఇప్పుడు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని అన్నారు. ఎక్కడ టికెట్ వస్తుందో కూడా తెలియని నాయకులు ఏదో పార్టీలో చేరి చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మొద్దని కోరారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రెండులక్షల ఎకరాలకు కూడా పట్టాలు ఇవ్వలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒకేరోజు నాలుగున్నర లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చిందని చెప్పారు. భద్రాద్రి రామాలయ అభివృద్ధి సైతం కేసీఆర్ మదిలో ఉందని, యాదాద్రి, కొండగట్టు ఆలయాల తరహాలోనే రామాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెంలో వనమాను, ఇల్లెందులో హరిప్రియను గెలిపించే బాధ్యతను సీఎం కేసీఆర్ తనకు అప్పగించారని, వారిద్దరూ ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన తాను తుదిశ్వాస వరకు ప్రజల కోసం సేవ చేస్తానని చెప్పారు. తన ప్రత్యర్థి ఎవరైనా సరే.. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని అన్నారు. అనంతరం వద్దిరాజు పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు.

వద్దిరాజుకు ఘన స్వాగతం

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం అర్బన్/సుజాతనగర్/జూలూరుపాడు : వద్దిరాజు రవిచంద్ర పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా భారీ సంఖ్యలో కార్ల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు అలరించగా, కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో భారీ గజమాలను క్రేన్ సాయంతో వనమా, వద్దిరాజుకు వేశారు. అంతకుముందు సుజాతనగర్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జూలూరుపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా, రవిచంద్రను కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ రుక్మాంగధర్ భండారి ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీలు బాదావత్ శాంతి, లావుడ్యా సోని, మున్నూరుకాపు సంఘం నాయకుడు బాపట్ల మురళి, ఆత్మ, మార్కెట్, పీఏసీఎస్ చైర్మన్లు బత్తుల వీరయ్య, భుక్యా రాంబాబు, మండె వీరహనుమంతరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు వనమా రాఘవ, చౌడం నరసింహారావు, రామిశెట్టి రాంబాబు, తోట శ్రీను, మాచినేని శేషగిరిరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, వేల్పుల నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, దేవరకొండ కిరణ్, బానోత్ ధర్మా, ధరావత్ లక్ష్మీనారాయణ, కృష్ణ, సర్పంచ్ బి.అనిత, ఎంపీటీసీలు మూడు గణేష్, బత్తుల మానస, తులసిరెడ్డి, పెద్దమల్ల నరేందర్, గాజుల సీతారామయ్య, రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ ప్రాంతాల వారు పలు సమస్యలపై వినతులు అందజేస్తున్నారని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలతతో కలిసి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజావాణి దరఖాస్తుల్లో కొన్ని..

- ఆరేళ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న తమ అర్హతకు తగిన ఉద్యోగాలివ్వాలని జెడ్పీకి చెందిన కారుణ్య నియామక అభ్యర్థులు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఇప్పటికే నియామక పత్రాలు ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తేగా.. దీనిపై సమాచారం సేకరించాలని సీఈఓకు ఎండార్స్ చేశారు.
- మణుగూరు మండలం బండారుగూడెం ఆదర్శనగర్‌కు చెందిన చల్లా నర్సయ్య తన ఇంటిస్థలాన్ని కొందరు కబ్జా చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని కోరగా తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన భూక్య శారద.. దేవీజతండా మినీ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్న తన అత్త భూక్య పాతిలి గతనెల 3న మరణించారని, ఆపోస్టు తనకు ఇప్పించాలని దరఖాస్తు చేయగా మహిళా, శిశు సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు.

స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలి

అర్హులైన యువతకు ఓటుహక్కు కల్పించడానికి పెద్ద ఎత్తున స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న వారం రోజుల పాటు నూతన ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు స్థానికంగా విచారణ చేయడంతో పాటు కుటుంబ సభ్యుల వాంగ్మూలం, ఫారం 7 స్వీకరించాలని తెలిపారు. గృహలక్ష్మి దరఖాస్తుల విచారణకు టీం సభ్యులు ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టాలన్నారు. జీఓ 76కు వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జూలూరుపాడు, ములకలపల్లి, చర్ల, దుమ్ముగూడెం, గుండాల మండలాల్లో సెల్ టవర్లు నిర్మించాల్సి ఉందని, అవసరమైన స్థల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, ఎన్నికల విభాగం తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో..

రైతుల రుణమాఫీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ ప్రియాంక ఆల పాల్గొని జిల్లా వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. అనంతరం కలెక్టర్ పోషణ మాసోత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నాడు చెల్లి.. నేడు అక్క


ఉత్తమ అవార్డు సాధించిన ఉపాధ్యాయురాళ్లు



అక్కా చెల్లెళ్లు రమాదేవి, అనురాధ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడేనికి చెందిన అక్కాచెల్లెళ్లు ఇద్దరికీ వేర్వేరు సంవత్సరాల్లో ఉత్తమ ఉపాధ్యాయినులుగా రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. చెల్లెలు గుంటి అనురాధ మేదరబస్తీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా బోధనలో ఉత్తమ మెళకువలు ప్రదర్శించినందుకు గాను 2018లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు గుంటి రమాదేవి ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో రమాదేవి అవార్డు అందుకోనున్నారు.

అజ్ఞానం పారదోలి.. విజ్ఞానం పంచుతూ..



- విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- సొంత ఖర్చులతో విద్యాలయాల్లో వసతుల కల్పనకు కృషి

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం చూపుతారని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ పలువురు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గేలా మెళకువలు నేర్పుతున్నారు. సొంత ఖర్చులతో విద్యాలయాలను బాగు చేయిస్తున్నారు. వైకల్యాన్ని జయించి తాము ఉన్నత స్థాయికి చేరడమే కాక విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి వారిలో కొందరు ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు.

వీళ్లు వైకల్యాన్ని జయించారు...

ఉపాధ్యాయులుగా దివ్యాంగులు

పాల్వంచరూరల్: ముగ్గురు నిరుపేద గిరిజన కుటుంబాల నుంచి వచ్చిన వారే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితికి తోడు అంగవైకల్యం. అయినా ప్రభుత్వ ఉపాధ్యాయులు కొలువులు సాధించి విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. పాల్వంచ మండలం కిన్నెరసాని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొట్టెం సురేష్, గుగులోతు భద్రు, బానోతు రవి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఇద్దరికి చిన్నతనంలోనే పోలియో కారణంగా రెండు కాళ్లు చచ్చుపడిపోగా, ఇంకో టీచర్‌కూ డిగ్రీ చదువుతున్న సమయంలో అనారోగ్యం కారణంగా రెండు కాళ్లు పడిపోయాయి. నడవలేని పరిస్థితుల్లోనూ కష్టపడి చదివి ఉపాధ్యాయులు ఉద్యోగాలు సాధించిన వీరు మూడు చక్రాల వాహనాలపై కిన్నెరసాని స్కూల్‌కు వచ్చి పాఠాలు బోధిస్తూ స్ఫూర్తిగా నిలిచారు.



పాఠం బోధిస్తున్న సురేష్



కిన్నెరసాని గిరిజన అశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు కొట్టెం సురేష్, గుగులోతు భద్రు, బానోతు రవి

పట్టుదలతోనే ఈ స్థాయికి...

కిన్నెరసాని ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు కొట్టెం సురేష్ మాట్లాడుతూ ఇల్లెందు మండలం వేపలగడ్డకు చెందిన తన తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తుండగా, చిన్నతనంలో తనకు పోలియో కారణంగా రెండు కాళ్లు నడవలేని పరిస్థితికి చేరాయని చెప్పారు. అయినా పట్టుదలతో బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసి 2013లో టీచర్ ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. తద్వారా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. మరో ఉపాధ్యాయుడు గుగులోతు భద్రు మాట్లాడుతూ తమది బయ్యారం మండలం సంతులాల్ పోడు తండా కాగా, నిరుపేదలైన తల్లిదండ్రులు కూలీకి వెళ్తూ పోషించారని తెలిపారు. పోలియో కారణంగా రెండు కాళ్లు చిన్నతనంలోనే చచ్చుపడినా బాధపడకుండా టీచర్ ఉద్యోగం చేయాలనే పట్టుదలతో బీఏ, బీఈడీ పూర్తిచేశానని, 2010లో డీఎస్సీలో ఉద్యోగం వచ్చిందని చెప్పారు. ఇంకో ఉపాధ్యాయుడు బానోతు రవి మాట్లాడుతూ బయ్యారం మండలం సింగారానికి గాను చెందిన తాను డిగ్రీ చదివే సమయంలో అనారోగ్యం కారణంగా రెండు కాళ్లు నడవలేని స్థితికి చేరాయని తెలిపారు. అయినా పట్టుదలతో ఎంఏ పూర్తిచేసి 2012లో డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించానని చెప్పారు. ఇంతటితో సరిపెట్టుకోకుండా ఉన్నత ఉద్యోగాలు చేయాలనే లక్ష్యంతో గ్రూప్స్‌కు సిద్ధమైనట్లు ఆయన తెలిపారు.

పనిచేసే పాఠశాలలోనే చదివిస్తూ..

జూలూరుపాడు: తాను పనిచేసే జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే తన పెద్దకుమారుడిని చదివిస్తూ ఆంగ్ల ఉపాధ్యాయుడు నంద్రు గురుమూర్తి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇతను ఉపాధ్యాయుడిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూనే ప్రవృత్తిగా కళా నైపుణ్యం ప్రదర్శిస్తున్నాడు. ఇతనికి చిత్రకళలో కూడా ప్రవేశం ఉంది. పాఠశాల భవనాల గోడలపై సైన్స్ పరికరాలు, జువాలజీ, బయాలజీ పాఠ్యాంశాలకు సంబంధించి బొమ్మలు గీస్తూ విద్యార్థులకు అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న జూలూరుపాడు హైస్కూల్‌లో కూడా గోడల మీద చిత్రాలు గీశారు. ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేలా సులభమైన పద్ధతిలో బోధిస్తారని పేరుంది.



కార్పెంటర్ పనులు చేస్తున్న ఉపాధ్యాయుడు

విభిన్న రంగాల్లో..

ఇక కార్పెంటర్‌గా, దర్జీగా, తాపీ పని కూడా చేస్తూ బహుముఖ ప్రతిభ చూపుతున్నారు గురుమూర్తి. ఇంట్లో ఫర్నిచర్ అంతా ఆయన తయారు చేసుకున్నాడు. దర్వాజలు, తలుపులు, డైనింగ్ టేబుల్, బీరువా తదితర కలప వస్తువులను అందంగా తయారు చేయడంలో నేర్పరి. తాపీ పనిలో కూడా దిట్ట. తన ఇంటికి ప్రహరీ, మరుగుదొడ్లు, ఇంట్లో ఇతర నిర్మాణ పనులు తానే చేసుకున్నాడు. టైలరింగ్, ఎలక్ట్రీషియన్ పనులు కూడా చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఈ ఉపాధ్యాయుడు.



పాఠశాల గోడపై మెనూ రాస్తున్న గురుమూర్తి

ఎంఎస్‌ఎంఈ అధికారుల స్థల పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీలోని ఖాళీ ప్రదేశాన్ని ఎంఎస్‌ఎంఈ అధికారులు సోమవారం పరిశీలించారు. మూడేళ్ల క్రితం ఎంఎస్‌ఎంఈ సంస్థ ద్వారా ఇల్లెందులో 80 మందికి శిక్షణ ఇచ్చారు. వారు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాల్సిఉంది. ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ జోనల్ మేనేజర్ పవన్ కుమార్, డీఈ సామ్రాట్ చంద్ర, ప్రైవేట్ కన్సల్టెన్సీ సభ్యులు ఏకాంబరనాథ్, ప్రాజెక్టు జీఎం శివకుమార్ తదితరులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు రూ.32 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, బీఆర్‌ఎస్ నాయకులు హరిసింగ్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, ఘాజీ, జానీ బాబా, మహేందర్, ఈశ్వర్, హరిప్రసాద్ యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని పైడిగూడెం, గౌరారం, పెద్దనల్లబల్లి, చిన్ననల్లబల్లి, సారపాక, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. 21 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సారా విక్రేతలను అదుపులోకి తీసుకుని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. సీఐ నాగేశ్వరావు, ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం



కలపను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామశివారు చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీశాఖ అధికారులు సోమవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల నిల్వ చేసిన రూ.3,71,138 విలువైన 76 దుంగలను పట్టుకుని కలపయార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్న మాట్లాడుతూ టేకు దుంగలను అక్రమంగా తరలించి నిల్వచేసిన స్మగ్లర్ల ఆచూకీని త్వరలోనే పసిగడతామని తెలిపారు. కాగా ఇటీవల కాచనపల్లి రేంజ్‌లో చెట్ల నరికివేత వ్యవహారంలో ఉన్నతాధికారులు బీట్ అధికారిని సస్పెండ్ చేశారు. అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నా అక్రమ కలప రవాణా ఆగడంలేదు. దాడుల్లో ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, డీఆర్ఓ సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: వివాహితను వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన సంఘం లక్ష్మీదేవిని ఆమె భర్త రాము, అత్త రమణ, బావ బాలకృష్ణ కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. మానసికంగా, శారీరకంగా హింసిస్తూ చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

వైద్యం వికటించి చిన్నారికి సీరియస్

క్లినిక్ మూసివేయాలని ఆర్‌ఎంపీకి అధికారుల ఆదేశం

దుమ్ముగూడెం: ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు అర్హతకు మించి చికిత్స అందించడంతో వైద్యం వికటించి చిన్నారికి సీరియస్‌కాగా, 108 ద్వారా భద్రాచలం తరలించారు. కొత్త మారేడు గ్రామానికి చెందిన చిన్నారి బుద్దుల లావణ్యశ్రీకి నాలుగు రోజులుగా జ్వరం వస్తోంది. దీంతో తల్లిందండ్రులు సోమవారం నరసాపురం గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు ఖాజా వద్దకు తీసుకొచ్చారు. చిన్నారిని పరీక్షించిన ఆర్‌ఎంపీ ఇంజెక్షన్ ఇచ్చి సెలైన్ బాటిల్ పెట్టి ఫీల్డ్ మీదకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆ చిన్నారికి వాంతులు, విరోచనాలు కావడంతోపాటు ఒళ్లంతా చల్లబడింది. దీంతో తల్లిదండ్రులు సమీపంలోని నరసాపురం ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లారు. డాక్టర్ చైతన్య చిన్నారిని పరిశీలించి వైద్యసేవలు అందించారు. పాప పరిస్థితి కొంచెం మెరుగయ్యాక 108 ద్వారా భద్రాచలం తరలించారు. అనంతరం డాక్టర్ చైతన్య ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సందర్శించి, అర్హతకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్లినిక్‌ను మూసివేయాలని హెచ్చరించారు. అనంతరం ఆర్‌ఎంపీ వైద్యుడు నిర్వహిస్తున్న మెడికల్‌షాపులో తనిఖీలు చేశారు.

అల్లుడినంటూ ఫోన్ చేసి..

రూ. 40 వేలు కాజేశాడు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని యమజాల వీధికి చెందిన సింగిరెడ్డి నర్సిరెడ్డికి ఈ నెల 2న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను మీ అల్లుడినంటూ నమ్మించాడు. బంధువులకు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి తీసుకొచ్చానని చెప్పి రూ. 40 వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. అనంతరం నర్సిరెడ్డికి అనుమానం వచ్చి తన అల్లుడు సాయికి ఫోన్ చేసి విషయం చెప్పగా.. తాను డబ్బుల కోసం ఫోన్ చేయలేదని తెలిపాడు. దీంతో బాధితుడు సైబర్ సెల్ 1930కు సమాచారం ఇచ్చాడు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

చంద్రుగొండ : చంద్రుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం ఓ శిశువు మృతి చెందింది. బాధితుల కథనం ప్రకారం... మండలంలోని బెండాలపాడు గ్రామానికి చెందిన గర్భిణి పద్దం లావణ్య కాన్పు కోసం ఆదివారం సాయంత్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. సోమవారం ఉదయం నొప్పులు రావడంతో సాధారణ కాన్పు చేసేందుకు సిబ్బంది ప్రయత్నించారు. ఈ క్రమంలో తలభాగం వరకు వచ్చిన శిశువు ఆగిపోయింది. దీంతో బలవంతంగా బయటకు లాగడంతో శిశువు మరణించింది. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ పూసం వెంకటేశ్వర్లుతోపాటు కుటుంబసభ్యులు పీహెచ్‌సీకి చేరుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆస్పత్రికి చేరుకున్న వైద్యాధికారిణి కనకం తనుజా బాధితులకు సర్దిచెప్పి పంపించారు. తాము కొత్తగూడెంలోని పెద్దాసుపత్రికి పంపించాలని ఎంత చెప్పినా సిబ్బంది పట్టించుకోలేని గర్భిణి కుటుంబీకులు చెబుతున్నారు. కాన్పు సమయంలో డాక్టర్ లేకపోవడంవల్లే శిశువు మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై డాక్టర్ తనుజాను వివరణ కోరగా.. డెలివరీకి ముందు అన్ని రిపోర్ట్‌లు సాధారణంగా ఉన్నాయని, నార్మల్ డెలివరీ అవుతుందని భావించామని, తమ నుంచి ఎలాంటి పొరపాటు లేదని తెలిపారు.



మృత శిశువు

చికిత్స పొందుతున్న యువకుడు...

పాల్వంచరూరల్: పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పాండురంగాపురంతండాకు చెందిన గుగులోతు హరీష్(32) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 20న మద్యం మత్తులో గ్రామశివారులో పురుగులమందు తాగాడు. దీంతో కుటుంబీకులు కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గత నెల 28న అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు ఖమ్మంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని సోదరుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య హర్షిత, కుమారుడు హర్ష, కుమార్తె వర్షిత ఉన్నారు.



హరీష్(ఫైల్)

గుండెపోటుతో రిటైర్డ్ కానిస్టేబుల్...

మణుగూరురూరల్: మణుగూరుకు చెందిన రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ సయ్యద్ రహంతుల్లా హుస్సేన్(75) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

క్లుప్తంగా...

'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు 'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ఆ సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. తద్వారా కొనుగోలుదారుల నమ్మకానికి భరోసా ఇవ్వాలని అన్నారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రాజెక్టులకు సోమవారం ఆయన షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజులలోగా వివరణ ఇవ్వాలని సంబంధిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆదేశించారు. షాద్‌నగర్ సమీపంలోని చెరుకుపల్లి, కొందుర్గ్‌లో స్వర్గసీమ శాండిల్ ఉడ్ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ 'స్వర్గసీమ సుకేతన' పేరుతో నివాస ప్లాట్లు విక్రయించే వెంచర్ చేపట్టి 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టడంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. మాదాపూర్‌కు చెందిన జేఎల్ఎల్ అనే నిర్మాణ సంస్థ 'రెరా' రిజిస్ట్రేషన్ పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం అథారిటీ దృష్టికి వచ్చినందున షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. మహేశ్వరం, తుక్కాపూర్ గ్రామం, శ్రీనగర్ ప్రాంతాలలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 ప్రాంతంలో 'కాంస్టెల్లా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు' రెరా రిజిస్ట్రేషన్ ఉండి కూడా ప్రకటనలో, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ చూపని కారణంగా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

వెంకటేశ్వర హ్యాచరీస్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

మహారాష్ట్ర, కర్ణాటకలో కలిపి రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తుల జప్తు

సాక్షి, హైదరాబాద్: నగదు చెల్లింపులలో అక్రమాలపై ఫెమా చట్టాల (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మెనేజ్‌మెంట్ యాక్ట్) కింద నమోదైన కేసులో వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి లండన్‌లోని వెంకీస్ ఓవర్‌సీస్ లిమిటెడ్ కంపెనీకి 2011 నుంచి అక్రమంగా నిధుల మళ్లింపు జరిగినట్లు గతంలోనే గుర్తించిన ఈడీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ అక్రమ చెల్లింపుల సొమ్ముతో లండన్‌లోనూ స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. అన్ని కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కర్ణాటక, మహారాష్ట్రలోని తొమ్మిది స్థిరాస్తులను జప్తు చేసినట్టు వెల్లడించారు.

చిట్టాలో చినబాబు!

▶ మొదటి పేజీ తరువాయి



మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆ రోజు చంద్రబాబు పీఏ శ్రీనివాస్ డబ్బుల పంపిణీ గురించి అడగ్గా కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను పార్టీ ఆఫీసులో అందించినట్లు పార్థసాని పేర్కొన్నాడు. అంకిత్ బలదూత ద్వారా రూ.2.2 కోట్లు పంపగా, రఘు రేలాకు సన్నిహితుడైన శ్రీకాంత్ ద్వారా మిగిలిన మొత్తాన్ని పంపినట్లు చెప్పడంతో ''అయితే ఓకే..'' అంటూ చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బదులిచ్చాడు. ఈమేరకు నగదు తరలింపులకు సంబంధించి శ్రీకాంత్ ఫోన్ నుంచి జరిగిన వాట్సాప్ సంభాషణలను కూడా ఐటీ అధికారులు జత చేశారు. వాంగ్మూలం నమోదు సమయంలో ఈ సంభాషణలను మనోజ్ వాసుదేవ్‌కు చూపగా అది నిజమేనని అంగీకరించినట్లు ఐటీశాఖ పేర్కొంది. డేటా చౌర్యం ఐటీ గ్రిడ్ కేసులో కూడా కిలారు రాజేష్ కీలక పాత్రధారిగా వ్యవహరించిన విషయం విదితమే.

రఘు ద్వారా రూ.20.18 కోట్లు తరలింపు..

విశాఖకు చెందిన రఘు రేలా ఆర్‌వీఆర్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు 18కిపైగా కంపెనీలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. షాపూర్జీ పల్లోంజీ నుంచి అక్రమంగా నగదు తరలింపులో రఘు రేలా కీలకపాత్ర పోషించినట్లు గుర్తించిన ఐటీ అధికారులు ఆర్‌వీఆర్ గ్రూపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల ఆధారంగా మనోజ్ వాసుదేవన్‌ను విచారించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రఘు రేలా ద్వారా మొత్తం రూ.20.18 కోట్లను తరలించినట్లు మనోజ్ పార్థసాని అంగీకరించాడు. ఈ నగదు తరలింపులో రఘుకు సన్నిహితులైన కృష్ణ, నారాయణ అనే ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, అయితే వారి గురించి తనకు ఎటువంటి వివరాలు తెలియవని పేర్కొన్నాడు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఈ మొత్తాన్ని తరలించారని, ఇందుకు ఎక్సెల్ షీట్ స్పష్టమైన ఆధారమని ఐటీ శాఖ వెల్లడించింది.

ఓటమిపై ఆవేదన

నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించిన మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. టీడీపీ ఘోరంగా ఓడిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన పీఏ శ్రీనివాస్‌కు మనోజ్ వాసుదేవ్ ఒక మెసేజ్ పంపారు. తన జీవితంలో ఇటువంటి దారుణమైన రాజీనామా లేఖను చూడలేదని అందులో పేర్కొన్నారు. వీరి మధ్య బంధం ఎంత బలంగా ఉందనేందుకు ఆ మెసేజ్ నిదర్శనమని ఐటీ శాఖ తన నోటీసులో పేర్కొంది. నిర్మాణ రంగ సంస్థల నుంచి నగదును అక్రమంగా తరలించారనేందుకు ఇవి తిరుగులేని సాక్ష్యాలని, నగదు తరలింపులో మీ తనయుడు లోకేష్ సన్నిహితులు కీలకపాత్ర పోషించారనేందుకు ఇవన్నీ నిదర్శనమని చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో ఐటీ శాఖ స్పష్టంగా పేర్కొంది.

సిరిధాన్యాలపై అంతర్జాతీయంగా ఆసక్తి

- కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే
- విత్తనాలు, ఆహార ఉత్పత్తులపై విదేశీ ప్రతినిధుల వాకబు
- వ్యవసాయంపై జీ–20 సదస్సు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి అనుకూలమైన సిరిధాన్యాలపై ఇప్పుడు అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ–20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో మొదలైన 'క్లైమేట్ రెసిలియెంట్ ఫార్మింగ్'టెక్నికల్ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీ–20 సమావేశాల్లో పాల్గొంటున్న అనేక దేశాల ప్రతినిధులు, సిరిధాన్యాలపై ఆసక్తికనబరుస్తున్నారని, విత్తనాలతోపాటు ఉత్పత్తులు, వాటి తయారీ పద్ధతుల గురించి వాకబు చేస్తున్నారని తెలిపారు. విదేశీ ప్రతినిధుల ఆసక్తి ముఖ్యంగా రాగి విత్తనాలపై కనిపించిందని, మరికొందరు ఇతర ధాన్యాల గురించి కూడా అడిగారని, దేశంలోనూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా సిరిధాన్యాలు సాగు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని వివరించారు.

వాతావరణ మార్పులు తట్టుకోవడానికి ..

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిని ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ సమస్యను అధిగమించేందుకు అందరూ చేతులు కలపాలని మంత్రి పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు భారత్ సిరిధాన్యాలను ప్రోత్సహిస్తోందన్నారు. చాలా రాష్ట్రాల్లో సిరిధాన్యాలను రేషన్ డిపోల ద్వారా కూడా అందిస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయం విషయంలో కొన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించడం లేదని మంత్రి కరంద్లాజే ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు ఐసీఏఆర్ ఇప్పటికే దాదాపు 1,880 కొత్త వంగడాలను సిద్ధం చేయడంతోపాటు నీరు, ఎరువులు వంటి వ్యవసాయ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు ప్రణాళికలను కూడా రూపొందించిందని తెలిపారు. కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలన్నీ ఇప్పుడు వాడకంలో ఉన్నాయని, గత ఏడాది గోధుమ వంగడం అధిక వర్షాలను కూడా తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్–క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్, ఐసీఏఆర్–డీడీజీ ఎస్.కె.చౌదరి, డేర్ కార్యదర్శి అల్కా నంగియా అరోరా పాల్గొన్నారు.

మృత్యు పాశాలు

- విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం
- మంచిర్యాలలో తండ్రి, కుమారుడు..
- సిద్దిపేట జిల్లాలో పెళ్లయిన మూడు రోజులకే నవ వరుడు..

వెలుగులు పంచే విద్యుత్ తీగలు బతుకుల్లో అంధకారం నింపాయి. ముగ్గురి జీవితాలకు ఉరితాళ్లయ్యాయి. రెండు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చాయి. దండెంపై బట్టలు ఆరేస్తూ విద్యుదాఘాతానికి గురైన తండ్రి.. అతన్ని కాపాడబోయిన కొడుకు కన్నుమూస్తే.. మరోచోట కొత్త పెళ్లికొడుకు పెళ్లయిన మూడోరోజే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘటనలు రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి..


నిరంజన్‌చారి (ఫైల్)


అరుణ్ కుమార్(ఫైల్)


రాజేందర్ (ఫైల్)


కారణమైన ఇనుప కూలర్, పైన దండెం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సిద్దిపేట కమాన్: మంచిర్యాల పట్టణం ఏసీసీ కాలనీ శివరామాలయం వీధికి చెందిన ఎడ్ల రాజేందర్ (50), సెక్యూరిటీ గార్డుగా, భార్య సరోజ ఇళ్లలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఎంసీసీ క్వార్టర్‌లో నివసిస్తున్న వీరి కొడుకు అరుణ్‌కుమార్(17) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షోరూం నుంచి అరుణ్‌కుమార్ ఇంటికి భోజనానికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి రాజేందర్ స్నానం చేసి, దండెంపై తువ్వాలు ఆరేస్తుండగా ఇనుప కూలర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రి అరుపులు విని అతన్ని కాపాడబోయిన అరుణ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాజేందర్ తమ్ముడు కర్రతో విద్యుత్‌తీగను గట్టిగా కొట్టడంతో.. తండ్రీకొడుకులు కింద పడ్డారు. అనంతరం ప్రథమ చికిత్సలో భాగంగా వారిద్దరి శ్వాస ఆడేందుకు ప్రయత్నించినా కోలుకోలేదు. దీంతో 108 అంబులెన్సులో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా తండ్రీకొడుకులు ఇద్దరూ అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహమైన మూడ్రోజులకే..

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన జయలక్ష్మి, పెంటయ్య చారి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు రామోజు నిరంజన్‌చారి (38) ఉన్నారు. వీరు కుటుంబంతో కలిసి సిద్దిపేట పట్టణం నాసర్‌పురలో నివసిస్తున్నారు. నిరంజన్ 2003 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికై 2005 నుంచి పనిచేస్తున్నారు. 2012 నుంచి సిద్దిపేట ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నిజామాబాద్ బోధన్‌కు చెందిన అమ్మాయితో శనివారం ఘనంగా వివాహం జరిగింది. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో ఘనంగా రిసెప్షన్ ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్‌కు బంధువులను ఆహ్వానించడానికి నిరంజన్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటిపైకి వెళ్లారు. ఈ క్రమంలో భవనానికి అలంకరించిన విద్యుద్దీపాలకు సపోర్ట్‌గా కట్టిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, నవ వధువు రోదించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సహోపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో నిరంజన్ మృతదేహానికి అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ప్రజల నుంచి వసూలు చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం స్పష్టం చేసింది.

ఎంత సబ్సిడీ చెల్లించకపోతే అంత మోత..

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం సబ్సిడీతో పోలిస్తే వాస్తవంగా చెల్లిస్తున్న సబ్సిడీ తక్కువగా ఉంటుండటంతో డిస్కంలు భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన సబ్సిడీ మేరకు చార్జీలను పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిందేనని కేంద్రం ఆదేశించింది. ఉదాహరణకు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు యూనిట్‌కు రూ.8 చార్జీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తోంది. దీంతో వినియోగ దారులు చెల్లించే రూ.4కు లోటు సబ్సిడీ రూ.2 కలి పి మొత్తం రూ.6కు చార్జీ పెంచుకోవాల్సిందిగా కేంద్రం సూచించింది. ఒకవేళ ప్రభుత్వం సబ్సిడీ పూర్తి గా చెల్లించని పక్షంలో రూ.8 వసూలు చేసుకోవాల ని ఆదేశించింది.

ఇకపై సబ్సిడీల వివరాలతో త్రైమాసిక నివేదికలు

కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీలను ఎప్పటికప్పుడు ముందస్తుగా డిస్కంలకు చెల్లించకతప్పని పరిస్థితి నెలకొంది. కాగా కేటగిరీల వారీగా వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలను కచ్చితంగా లెక్కించడానికి కొత్త విధానాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కేటగిరీల వారీగా ఓ త్రైమాసికంలో సబ్సిడీ వినియోగదారులు ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ప్రతి యూనిట్ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా చెల్లించిన సబ్సిడీ ఎంత? ఇంకా రావాల్సిన సబ్సిడీ బకాయిలు/లోటు ఎంత? అనే వివరాలతో రాష్ట్రాల ఈఆర్సీలు త్రైమాసిక నివేదికను విడుదల చేయాలి. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఈఆర్సీకి డిస్కంలు ఈ మేరకు వివరాలతో నివేదికను సమర్పిస్తాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన సవరణలతో 30 రోజుల్లోగా ఈఆర్సీ తుది త్రైమాసిక నివేదికను ప్రకటిస్తుంది. నిబంధనల మేరకు విద్యుత్ సబ్సిడీ అకౌంటింగ్ జరగలేదని, సబ్సిడీల కోసం ప్రభుత్వానికి బిల్లులు పంపించలేదని తేలితే డిస్కంలోని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీలను కేంద్రం ఆదేశించింది.

జిల్లా వార్తలు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పీఓ దరఖాస్తులపై అధికారులతో సమీక్షిస్తూ అర్హులకు సత్వరమే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గిరిజన విద్యార్థుల కనీస సామర్థ్యాలు అంచనా సర్వేపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ దర్బారులో ఐటీడీఏ పరిపాలనా అధికారి భీమ్, అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, దుర్గయ్య, హరీశ్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 15 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న 15 మంది ఈ అండ్ ఎం అధికారులను యాజమాన్యం బదిలీ చేసింది. ఈ మేరకు ఈఈ సెల్ జీఎం కవితానాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురు ఏజీఎం స్థాయి, ఆరుగురు డీజీఎం స్థాయి అధికారులతో పాటు ముగురు ఎస్ఈలు, ఇద్దరు ఈఈ స్థాయి అధికారులు ఉన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలలో తరగతులు ప్రారంభం

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి మంజూరైన జేఎన్‌టీయూ కళాశాలను తాత్కాలికంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలోని మహ్మదీయ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. మూడు బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కాగా, కళాశాల ఆలస్యంగా మంజూరైన నేపథ్యాన విద్యార్థులు చేరేందుకు ఈనెల 8వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

అడ్తీ లైసెన్సులకు అర్హుల గుర్తింపు

- 420 మంది దరఖాస్తుదారుల్లో 140 మంది ఎంపిక
- ఈనెల 8న నూతన లైసెన్సుల జారీ


ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా అడ్తీ(కమీషన్) లైసెన్సులను జారీ చేసేందుకు అర్హులను గుర్తించారు. అడ్తీదారుల లైసెన్సుల కోసం 420 దరఖాస్తులు అందగా, వారిలో 140 మందిని మార్కెట్ కమిటీ ఎంపిక చేసింది. ఎంపికైన వారు నిర్దేశించిన ధృవపత్రాలను సమర్పిస్తే లైసెన్సులు జారీ చేయనున్నారు. రైతులు, పంట కొనుగోలు చేసే ఖరీదుదారులకు ధరల విషయంలో మధ్యవర్తులుగా అడ్తీదారులు వ్యవహరిస్తారు. అంతేకాక రైతుల పంట ఖర్చుకు పెట్టుబడి కూడా సమకూరుస్తారు. అనంతరం పంటలను మార్కెట్‌లో ఖరీదుదారులకు చూపించి ధర నిర్ణయించి రూ.2 చొప్పున కమీషన్ తీసుకుంటారు. ఇలా ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 470 మంది ఉండగా.. కొందరు పనిచేయకపోవడంతో 350 మంది వరకు ఉన్నట్లు అంచనా. ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే రెండో పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరున్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొందరు లైసెన్సు లేకుండా అడ్తీ వ్యాపారులుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఏటా రూ.25 వేల కోట్ల విలువైన లావాదేవీలు జరుగుతున్నందున ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అడ్తీదారుల సంఖ్యను పెంచాలని మార్కెట్ కమిటీ నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం కొందరికి లైసెన్సు ఇవ్వగా, మళ్లీ తాజాగా లైసెన్సులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం గతనెల 30 నుంచి దరఖాస్తులు స్వీకరించగా, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం పర్యవేక్షించారు.

అనుభవం, స్థోమత ఆధారంగా...

అడ్తీ లైసెన్సుల కోసం 420 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 140 మందిని ఎంపిక చేశారు. వ్యాపార అనుభవం, ఆర్థిక స్థోమత అంశాలను ప్రామాణికంగా తీసుకున్నట్లు మార్కెట్ కమిటీ వెల్లడించింది. ఇందులో భాగంగా ఎంపికైన వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వీరు అవసరమైన ధృవపత్రాలతో పాటు రూ.1,000 డీడీ సమర్పించాల్సి ఉంటుంది. నిర్దేశిత ధృవపత్రాలు, డీడీలు సమర్పించిన వారికి ఈ నెల 8వ తేదీన లైసెన్సులు జారీ చేయనున్నారు.

ఉత్సాహం.. నిరుత్సాహం

లైసెన్సులకు ఎంపికైన వారు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. దరఖాస్తు చేసుకున్న మిగతా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా అన్ని అర్హతలు ఉన్నందున లైసెన్సు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ అంశంపై మార్కెట్ కమిటీ బాధ్యులు మరికొన్నాళ్లకు ఇంకొందరికి లైసెన్సులు జారీ చేసే అవకాశముందని తెలిపారు.

చదివిన కళాశాలకే డీన్‌గా!

అరుదైన అవకాశం దక్కించుకున్న హేమంత్‌కుమార్


అహ్మద్ హుస్సేన్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న హేమంత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: ఓ పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. ముప్పై మూడేళ్ల క్రితం వ్యవసాయ కళాశాలలో చదువుకున్న డాక్టర్ హేమంత్‌కుమార్ ఇప్పుడు ఇదే కళాశాలలో డీన్‌గా బాధ్యతలు స్వీకరించడం హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ఖమ్మం జిల్లా వేంసూరు మండలం దిద్దుపూడికి చెందిన హేమంత్‌కుమార్ అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో 1993 బ్యాచ్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థిగా చేరి, 1994లో పట్టాను అందుకున్నారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన ఆయన శాఖలో అనేక హోదాల్లో విధులు నిర్వర్తించారు. గడిచిన ఏడేళ్లుగా ఖమ్మం జిల్లాలోని వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా ఇటీవల పదోన్నతి కల్పించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్‌గా నియమించారు. దీంతో చదివిన కళాశాలలోనే డీన్‌గా అరుదైన అవకాశాన్ని అందుకున్నట్లయింది. ఇక్కడ చదివిన పలువురు ఇదే కళాశాలలో ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉన్నతమైన స్థానం(డీన్) దక్కించుకున్న ఘనత మాత్రం హేమంత్ కుమార్‌కే దక్కింది.

బాధ్యతలు స్వీకరించిన హేమంత్‌కుమార్

అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ జె.హేమంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీన్‌గా ఉన్న డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌కు సంగారెడ్డిలోని కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాలకు బదిలీ కాగా, ఆయన అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ డీన్‌గా బదిలీపై వచ్చిన హేమంత్ బాధ్యతలు స్వీకరించారు.

గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులను విస్మరించి బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాన్ని వర్తింపచేస్తే ఆందోళనలు నిర్వహిస్తామని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్.ప్రదీప్ హెచ్చరించారు. ఖమ్మంలోని రాన‌రసయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకాన్ని అటకెక్కించి గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. అలాగే, దరఖాస్తుకు నాలుగు రోజుల సమయమే ఇవ్వడంతో అర్హులు నష్టపోయే అవకాశముందన్నారు. ఇకనైనా పార్టీ పథకంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వీ.రాకేష్, నాయకులు కూసు మోహన్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, ధరణి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయం


విలేకరులతో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని, అందులో ఎలాంటి సందేహం లేదని రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు. అశ్వారావుపేటలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుంకవల్లి వీరభద్రరావు ఇంట్లో శుభ కార్యానికి సోమవారం హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించడమే తన రాజకీయ లక్ష్యమని తెలిపారు. ఈ పని పూర్తిచేసేందుకు ఎన్నికల్లో నిలబడుతున్నానని, అనుచరులు, ప్రజల కోరిక మేరకే తన నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి వద్ద ఉన్న వెంకమ్మ చెరువు కాల్వల నిర్మాణంపై ఆరా తీసిన ఆయన ఇరిగేషన్ డీఈ కృష్ణతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. అలాగే కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సీతారామ ప్రాజెక్టు మాదిరి పరిహారం ఇచ్చేలా ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు బండి పుల్లారావు, ఆలపాటి రాము, నిర్మల పుల్లారావు, జేకేవీ.రమణారావు, జ్యేష్ఠ సత్యనారాయణ, ఇస్మాయిల్, బాజీ, ఆంధ్రు ప్రసాద్, బుజ్జి, జీవన్‌రావు, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించండి

వీసీలో సింగరేణి సీఎండీ శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం, సత్తుపల్లి, కిష్టారం ఓసీల అధికారులు

సత్తుపల్లిరూరల్: ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించగా, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యాన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ రాఖీ పౌర్ణమి లక్కీ డ్రా


సత్తుపల్లిలోని డ్రా బాక్స్‌లో టికెట్ వేస్తున్న యువతి

ఖమ్మంమామిళ్లగూడెం: రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో విజేతలను మంగళవారం ఎంపిక చేయనున్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా యజమాన్యం లక్కీ డ్రా ఏర్పాటుచేయగా, 30, 31వ తేదీల్లో ప్రయాణించిన మహిళలు టికెట్లపై వివరాలు రాసి బస్టాండ్లలోని బాక్సుల్లో వేశారు. ఇందులో నుంచి రీజియన్‌కు ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతి ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. విజేతలను రీజియన్ కేంద్రాల్లో ఎంపిక చేసి విజేతలకు హైదరాబాద్ ఎంజీబీఎస్ ప్రాంగణంలో ఈనెల 8న అందజేయనున్నారు.